పైలాన్‌కాలనీలోని బస్తీ దవాఖాన పనులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు

బస్తీ దవాఖాన పనుల పరిశీలన

నందికొండ, మార్చి 12 : మున్సిపాలిటీలో నూతనంగా ప్రారంభించనున్న బస్తీ దవాఖాన పనులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జిల్లాలో 7 బస్తీ దవాఖానలు మంజూరు కాగా, వాటిలో 6 దవాఖానలు ప్రారంభమయ్యాయని, ఏడోది పైలాన్‌కాలనీలోని ప్రారంభం కావాల్సి ఉందన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆదేశానుసారం దవాఖాన ప్రారంభించేందుకు చేపట్టాల్సిన పనులను పరిశీలించామన్నారు. కొన్ని చిన్న పనులు చేపట్టాల్సి ఉందని, త్వరగా పూర్తిచేయించాలని ఏఈని ఆదేశించామన్నారు. ఆయన వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ అధికారులు డాక్టర్ అరుంధతి, ఉమ, యూఎఫ్‌డబ్ల్యూసీ డాక్టర్ నగేశ్, ఏఈ వినిల్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు

- కలెక్టర్ దాసరి హరిచందన

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరై మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నీలగిరి, మార్చి 12 : రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి గడువులోగా ఓటర్ జాబితాను రూపొందిస్తామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్‌ను గుర్తించామని, వెబ్ కెమెరాలను కూడా సిద్ధం చేశామనారు. ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా వీడియో సర్వేలెన్స్, వీడియో వీక్షణకు అవసరమైన కెమెరాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వ్యతిరేక వార్తలపై ఎప్పటికప్పుడు స్పందించి ఎన్నికల సంఘానికి పంపించే బాధ్యతను కలెక్టర్లు పర్యవేక్షించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు సంబంధించి సమాచారాన్ని ఈ నెల 13లోగా పంపించాలని, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది డేటా అప్‌డేషన్‌పై దృష్టి కేంద్రీకరించాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్‌డీఓ రాజ్యలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఆర్డీఓలు రవి కుమార్, చెన్నయ్య, రాములు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, మార్చి 12 : మండలంలోని గ్రామాలను అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం నార్కట్‌పల్లి, చిన్నతుమ్మలగూడెం, షాపల్లిలో రూ. 35 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, బత్తుల ఊషయ్య, సట్టు సత్తయ్య, వడ్డె భూపాల్, భరత్, శ్యాంసుందర్, దూదిమెట్ల వెంకన్న, నర్సింహ పాల్గొన్నారు.

'తెలుగు రైతుబడి'కి ఐఐఐటీ ఢిల్లీ ఆహ్వానం

జూలకంటి రాజేందర్‌రెడ్డి

రామగిరి, మార్చి 12 : డిజిటల్ మీడియా వేదికల ద్వారా తెలుగు రైతులకు సమగ్ర వ్యవసాయ సమాచారం పంచుతున్న తెలుగు రైతుబడికి అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఐఐఐటీ-ఢిల్లీ నిర్వహిస్తున్న ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొని ప్రసంగించాలని తెలుగు రైతుబడి వ్యవస్థాపకుడు జూలకంటి రాజేందర్‌రెడ్డిని ఆహ్వానించింది. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో యువతకు అవకాశాలపై చర్చించేందుకు రావాలని కోరింది. ఈ నెల 15, 16న ఢిల్లీలోని ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో సమ్మిట్ జరుగనున్నది.

ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా పర్వీన్

త్రిపురారం, మార్చి 12 : మండలంలోని పెద్దదేవులపల్లి అంగన్‌వాడీ కేంద్రం-1 టీచర్ పర్వీన్‌బేగం సేవలను గుర్తించి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా అవార్డు అందజేశారు. ఈ మేరకు జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి సక్కుబాయి పర్వీన్ నుంచి అవార్డు అందుకున్నారు. ఆమెను సీడీపీఓ చంద్రకళ, సూపర్‌వైజర్లు అభినందించారు.

ఆర్థిక సాయం

చిట్యాల, మార్చి 12 : మండలంలోని వట్టిమర్తి జడ్పీహెచ్‌ఎస్‌లో రోజారాణి పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసేవారు. ఆమె ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుమారుడి ఉన్నత చదువుల కోసం మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు రూ.71వేలను జమ చేసి మంగళవారం చిట్యాలలోని ఎంఆర్‌సీ భవన్‌లో మృతురాలి కుమారుడు నాగఫణీంద్రకు అందజేశారు. ఎంఈఓ నర్సింహ, చిట్యాల హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఫ్లాగ్‌మార్చ్

- ఎస్పీ చందనా దీప్తి

నీలగిరి, మార్చి12 : రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో ఆత్మవిశ్వాసం కలిగించేందుకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా పోలీసులు, కేంద్ర సాయుధ బలగాల ఫ్లాగ్ మార్చ్‌ను క్లాక్ టవర్, వీటీ కాలనీ హనుమాన్ టెంపుల్, శివాజీనగర్, చందమామ టవర్స్, రామగిరి మీదుగా క్లాక్‌టవర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఫ్లాగ్ మార్చ్ చేపట్టామన్నారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలోని అన్ని మండలాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అంతకుముందు జిల్లా పోలీస్ కార్యాలయంలో పనిచేస్తున్న సైదులు, వహీద్ పాషా, ఇయావత్ అలీ అనే కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి, ఏహెచ్‌టీయూ విభాగంలో పనిచేస్తూ గుండెపోటుతో మృతి చెందిన కానిస్టేబుల్ నజీర్ సతీమణి సనా సమ్రీన్‌కు రూ.2లక్షల భరోసా చెక్ అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐలు సత్యనారాయణ, డానియల్, కరుణాకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

సీసీ రోడ్డు పనుల పరిశీలన

- ఎంపీపీ దూధీపాల రేఖ శ్రీధర్‌రెడ్డి

సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ రేఖాశ్రీధర్‌రెడ్డి

కొండమల్లేపల్లి, మార్చి 12 : గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్ల పనులను నాణ్యతతో చేపట్టాలని ఎంపీపీ దూధీపాల రేఖాశ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండంలోని గన్యానాయక్‌తండాలో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల సూచనల మేరకు తగిన ప్రమాణాలతో పనులు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట నాయకులు రమావత్ తుకారాంనాయక్, రమేశ్‌నాయక్, లస్కర్‌నాయక్, పాండు నాయక్ ఉన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ దగ్గర రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మంగళవారం మాజీ ఎంపీటీసీ బాలయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు గ్యార యాదయ్య, శిలువేరు చంద్రయ్య, పొనుగోటి శేఖర్, నాయకులు నీల శంకర్, పిట్టల కృష్ణ, కొండాపురం యాదయ్య పాల్గొన్నారు.

సీఎం, మంత్రులు బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను

నిడమనూరు, మార్చి 12 : యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా గుట్టలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను నేలపై కూర్చోబెట్టి అవమానించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరుపున బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవానికి వెళ్లిన భట్టి విక్రమార్కను అవమానించిన ఘటనను తీవ్రంగా ఖండించారు. సీఎం, మంత్రులు వారి సతీమణులకు ఇచ్చిన ప్రాధాన్యత ఇవ్వకుండా కుల వివక్షతో అవమానించడం గర్హనీయమన్నారు. ఘటనను ప్రజా స్వామికవాదులు, ప్రజలు ఖండించాలని కోరారు. ఆయన వెంట వింజమూరి శివ, పుల్లయ్య ఉన్నారు.

మహిళా సాధికారతను ఆచరణలో చూపించాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహిళా కన్వీనర్ వరలక్ష్మి

మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

నకిరేకల్, మార్చి 12 : దేశంలో స్త్రీలకు అన్నింటా సమాన అవకాశాలు ఆశిస్తున్నా నేటికీ అమలు కావడం లేదని, మహిళా సాధికారతను ఆచరణలో చూపించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహిళా కన్వీనర్ వరలక్ష్మి అన్నారు. రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నకిరేకల్ మండల శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం పురస్కరించుకొని 'సమానత్వంతో కూడిన మహిళ సాధికారత' అనే అంశంపై మహిళా సదస్సును మంగళవారం సంఘం డివిజన్ కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, నోముల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సుందరి, జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్సింహమూర్తి, శ్రీనివాస్, మండల మహిళా కన్వీనర్ సైదమ్మ, మహిళ నాయకులు పద్మలత, సరిత, జ్యోతి, నాయకులు తిరుమలయ్య, వేణుగోపాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పర్యావరణ అధ్యయనంపై నేచర్ క్యాంప్

నాగార్జున సాగర్‌లో నేచర్ క్యాంప్‌కు వెళ్తున్న కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

హాలియా, మార్చి12 : జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వుల మేరకు జిల్లాలో ఐదు పాఠశాలల నుంచి ఎంపిక చేసిన 50 మంది విద్యార్థులను ఈ నెల 12 నుంచి 14 వరకు పర్యావరణ అధ్యయనంపై నాగార్జునసాగర్‌లో నేచర్ క్యాంప్ ఏర్పాటు చేశారు. అందులో భాగంగా అనుముల మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు నేచర్ క్యాంప్‌కు వెళ్లారు. ఈ శిబిరంలో అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పిస్తారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి కుర్మారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి, జీవీ రామకృష్ణ, చింతల వెంకటేశ్వర్లు, సూర్యకాంతం, హేమలత, వాణి, జ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

శాలిగౌరారం : పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడరూరల్ /మునుగోడు/ శాలిగౌరారం/తిరుమలగిరి (సాగర్)/చిట్యాల, మార్చి12 : మిర్యాలగూడ మండలం తడక మళ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ఉద్యోగుల ఐక్యవేదిక తరపున రాంబాబుగౌడ్ మంగళవారం పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. అలాగే మునుగోడు మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు నల్లగొండ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో, శాలిగౌరారం మండలం వల్లాలలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు ఇటుకలపహాడ్‌కు చెందిన చైత్ర ఫౌండేషన్ చైర్మన్ రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో శాలిగౌరారం సీఐ శ్రీనివాస్‌రెడ్డి, తిరుమలగిరి(సాగర్)మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఆసరా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చిట్యాల జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో పుండరీచారి, భిక్షమయ్య, జానకిరామయ్య, ఎల్‌వీ కుమార్, నర్సిరెడ్డి, మదన్‌మోహన్, భాస్కర్, సత్యనారయణ, రాగిణి, శ్రీనివాస్, చిరంజీవి, మల్లేశ్, కొమురయ్య, నరేశ్, వినోవా, రెడ్యానాయక్, పార్వతమ్మ, హరికృష్ణ, నర్సింహ, కరుణాకర్ రెడ్డి, కృష్ణ, లింగస్వామి, సత్తయ్య పాల్గొన్నారు.

విధుల నుంచి డీఓ తొలగింపు

కొండమల్లేపల్లి, మార్చి 12 : మండల కేంద్రంలోని బీసీకాలనీలో గల సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్(డీఓ) సాయిలును మంగళవారం జిల్లా అధికారులు విధుల నుంచి తొలగించారు. ఈ నెల 2న పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహించిన ఓ మహిళా ఇన్విజిలేటర్‌తో డీఓ సాయిలు అసభ్యకరంగా, దురుసుగా మాట్లాడటంతో సదురు మహిళ మనస్థాపం చెంది డీఓపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. దాంతో విచారణ చేపట్టి సాయిలును విధుల నుంచి తొలగించి అతని స్థానంలో పాండురంగయ్యను నియమించినట్లు డీఐఈఓ దస్రూనాయక్ తెలిపారు.

చిరుధాన్యాలపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

త్రిపురారం, మార్చి 12 : ఈ నెల 23 వరకు నిర్వహించే పోషణ పక్షోత్సవంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు చిరుధాన్యాలపై అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. చిన్నారుల్లో రక్తహీనత నివారణకు ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని తల్లిదండ్రులు తమ చిన్నారులకు తినిపించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నిడమనూరు, మార్చి 12 : మండలంలోని వేంపాడు గ్రామపంచాయతీ పరిధిలోని కుమ్మరిగూడేనికి చెందిన యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిట్టిమల్ల సత్యనారాయణకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మూడో కుమార్తె చిట్టిమల్ల మహేశ్వరి(25) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. నెల క్రితం స్వగ్రామం వచ్చింది. వ్యవసాయ పనుల కోసం వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి సాయంత్రం ఇంటికి రాగా ఇంటి వద్ద మహేశ్వరి కనిపించలేదు. బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. మహేశ్వరి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.

నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రమేశ్

రామగిరి, మార్చి 12 : నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జూకూరి రమేశ్‌ను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు జీవో విడుదలైంది. వైస్ చైర్మన్‌గా జూలకంటి వెంకట్‌రెడ్డితోపాటు 14 మంది సభ్యులను నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు జీఓ 332 విడుదల చేశారు. కొత్తగా నియామకమైన వారికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

అయిలయ్య దిగజారుడు మాటలు మానుకోవాలి

- బీఆర్ఎస్ నాయకుడు లింగంగౌడ్

మర్రిగూడ, మార్చి 12 : టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి అయిలయ్యయాదవ్ కాంగ్రెస్ పార్టీ మెప్పు కోసం దిగజారుడు మాటలు మానుకోవాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చెర్కు లింగంగౌడ్ హితవు పలికారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు పెరుగుతాయని, పార్టీ నామమాత్రం కానున్నదని సోమవారం చండూరులో అయిలయ్య చేసిన వ్యాఖ్యలను లింగంగౌడ్ ఖండించారు.

15న టెలీ కాన్ఫరెన్స్

రామగిరి, మార్చి 12 : పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగే వార్షిక పరీక్షలకపై ఈ నెల 15న టెలీకాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు డీఈఓ భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 9121212513, 7989819053 నంబర్లలో సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మాడ్గులపల్లి, మార్చి 12 : మండలంలోని తోపుచర్ల గ్రామ పరిధిలోని ఎస్సీ కాలనీలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం జడ్పీటీసీ పుల్లెంల సైదులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. మాజీ సర్పంచ్ యాదయ్య, ఎరుకలి వెంకన్న, కట్టా శ్రీనివాస్‌రెడ్డి, నాగేందర్, భరత్, దేవయ్య, శ్రవణ్, అంజి, యాదగిరి, వెంకన్న పాల్గొన్నారు.

సేంద్రీయ సాగు చేయాలి : ఏఓ

త్రిపురారం, మార్చి 12 : రైతులు సేంద్రీయ సాగు చేపట్టి అధిక దిగుబడులు పొందాలని ఏఓ పార్వతీ చౌహాన్ రైతులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో రైతులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం రైతువేదికల్లో ప్రతి మంగళవారం రైతులకు వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధిపై శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మామిడిలో పిందె రాలకుండా నివారణ చర్యలను వివరించారు. ఏఈఓ నాగరాజు, స్వాతి, క్రాంతి, రైతులు పాల్గొన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

- ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి

నల్లగొండ సిటీ, మార్చి 12 : తమిళనాడులోని అరుణాచలేశ్వరి గిరి ప్రదక్షిణ కోసం ప్రతి పౌర్ణమి కి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా పౌర్ణమి రద్దీని బట్టి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు పేర్కొన్నారు. అరుణాచలం వెళ్లే భక్తులకు ఏపీలోని కాణిపాకం, తమిళనాడు వెల్లూరులోని గోల్డెన్ టెంపుల్ దర్శనం ఉంటుందని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

సంత వేలం వాయిదా

కట్టంగూర్, మార్చి 12 : స్థానిక పశువుల సంత వేలాన్ని వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి అశోక్ తెలిపారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీఓ అథర్ పర్వేజ్, ప్రత్యేకాధికారి జ్ఞానప్రకాశ్‌రావు అధ్యక్షతన సంత వేలం నిర్వహించారు. ఆరుగురు మాత్రమే పాల్గొన్న వేలంలో కొంపెల్లి యాదయ్య రూ.20 లక్షలకు పాడారు. మద్దతు ధర రానందున్న బుధవారానికి వాయిదా వేసినట్లు కార్యదర్శి తెలిపారు.

చండంపేటలో ముగిసిన ఓపెన్ ఫోరం

చండంపేట, మార్చి 12 : మండలంలో 2022-2023 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.3.67 కోట్లతో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సోమవారం రాత్రి వరకు ఎంపీడీఓ కార్యాలయంలో ఓపెన్ ఫోరం కొనసాగింది. వారం రోజులుగా సాగిన సామాజిక తనిఖీలో సేకరించిన వివరాల ఆధారంగా ఓపెన్ ఫోరంలో చర్చించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఆర్‌డీఏ పీడీ నవీన్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలో భాగంగా సేకరించిన వివరాల ఆధారంగా ఓపెన్ ఫోరం నిర్వహించినట్లు తెలిపారు. కాగా పలు గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై రికవరీకి ఆదేశించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నూన్సావత్ పార్వతీచందునాయక్, జడ్పీటీసీ బుజ్జి లచ్చి రాంనాయక్, అంబుడ్స్‌మన్ గౌరి, విజిలెన్స్ అధికారి ఫయాజ్, ఎంపీడీఓ లక్ష్మి, క్వాలిటీ కంట్రోల్ అధికారి హర్షవర్ధన్, క్లస్టర్ ఏపీడీ రవీందర్, ఎస్ఆర్‌పీ రమేశ్, ఇన్‌చార్జ్ ఏపీఓ శంకర్ నాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- తాసీల్దార్ శ్రీనివాస్

చండంపేట, మార్చి 12 : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని చండంపేట తాసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒత్తిడి లేకుండా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం మిర్యాల అశోక్ ఆర్థిక సాయంతో విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఎంఈఓ సామ్యానాయక్, హెచ్ఎం చంద్రశేఖర్, మల్లీశ్వరి, కొండల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రూప్ పోస్టులను పెంచాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్

మిర్యాలగూడ, మార్చి 12 : ఎంతోకాలంగా గ్రూప్స్ ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం ఎదురుచూసిన నిరుద్యోగులకు ప్రభుత్వం కొన్ని పోస్టులను మాత్రమే విడుదల చేయడంతో నిరుద్యోగులకు నిరాశే మిగిలిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విడుదల చేసిన 503 గ్రూప్-1 పోస్టులను రద్దు చేసి కేవలం 60 పోస్టులను మాత్రమే కలిపి టీఎస్‌పీఎస్సీ కొత్త నోటిఫికేషన్ విడుదల చేసిందని, అంతేకాకుండా గ్రూప్-2,3 పోస్టుల సంఖ్య కూడా నిరుద్యోగులు ఆశించిన మేర లేవన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి గ్రూప్ ఉద్యోగాల్లో మరిన్ని పోస్టులను కలిపి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు.

ఘనంగా స్వపరిపాలన

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 12 : మండలంలోని అంగడిపేట స్టేజీ వద్ద గల విజ్ఞాన్ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు మంగళవారం స్వపరిపాలన దినోత్సవం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా, అధికారులు విధులు నిర్వర్తించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మిర్యాలగూడ, మార్చి 12 : పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పంగా ఉపేందర్(37) గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ సాలకమ్మ తెలిపారు. స్థానికంగా నివాసం ఉంటున్న ఉపేందర్ ప్లంబర్